
# విషపు కుండలో పాల చుక్క

పెనుమాక నాగేశ్వరరావు



## గుండె బలం



ఈ గుప్పెడు గుండెకి
గంపెడు ఆశలు - ఆక్రోశాలు
ఎన్నని భరించను
ఎన్నని త్యజించను
ఒకటా రెండా అన్నీ
ఆ గుండెకే అంకితం
సంతోషానికి గుండె
సందేహానికి గుండె
సంకోచానికి గుండె
సంకేతాలకి గుండె
రెండు మనసులు కలిపేది గుండె
రెండు మనుషులను విడదీసేది ఈ
గుండే!
అలసటైనా.. ఆనందమైనా
స్పందన మాత్రం గుండెకే
ప్రకృతి శోభ విపరీతం
అన్నీ తనకే సొంతం
గుండెను తీసే బంటులు
గుండె కోతకై మనుషులు
గుండెను పిండి చేసే రాక్షసులు
అందరికీ వుండటి గుండె
ఆ గుండెకు కూర్చాలి ఆనందం
అతలాకుతలం చేయుట నేరం
గుండెగలవారంతా కలవారే
గుండెలేని రక్కసులంతా
నరకాసురులే


- సంధ్య

**రాత్రి రెండు గంటల సమయం. రెండు చేతుల్లోనూ రెండు బరువైన సూట్‌కేసుల్తో రైలు దిగాను. ప్లాట్ ఫారంపైన జనం పలుచగా వున్నారు. ఆ సమయంలో కూడా ఆ మాత్రం జనం వుండటం నాకు కాస్తంత వూరట నిచ్చింది. రైలు దిగుతూనే ఎదురుగా కన్పించిన పోర్టర్‌ను ఆ స్టేషన్‌కు రావలసిన మరో రైలు గురించి వాకబు చేశాను. ఆ రైలు వెళ్ళిపోయిందని చెప్పాడు. పైగా తెల్లవారేవరకు మరో రైలు లేదని కూడా చెప్పి తన బేరం చూసుకునేం దుకు వెళ్ళాడు. ఒక్కసారిగా నీరసం, నిస్సత్తువకు లోనయ్యాను. మరో మూడు గంటలు ఆ ప్లాట్‌ఫారంపైన గడపక తప్పదనే అనుకున్నాను.**

అంతలోనే ఓ తండ్రీ, కూతురు కాస్తంత లగేజీతో అక్కడికి చేరుకున్నారు. వాళ్ళు కూడా నేను వెళ్లాల్సిన వూరుకే బయల్దేరారని తెలిసింది. నేను దిగిన రైల్లో నుంచే ఆ అమ్మాయి దిగిందట. తండ్రి అక్కడ కలుసుకు న్నాడు. ఆయన మాటల ద్వారా నేను ఎక్కవల సిన రైలు ఇంకా రాలేదని, మరికొద్ది సేపట్లో వస్తుందని తెలుసుకున్నాను. ఉత్సాహం వచ్చింది కాని, నేను ఆ రెండు సూట్‌కేసుల్తో నాలుగవ నంబరు ప్లాట్‌ఫారం నుంచి బుకింగ్ కౌంటరుకు వెళ్ళి మళ్ళీ టిక్కెట్టు తీసుకోవడం అంటే చాలా కష్టం అనిపించింది. అటుగా వెళ్తున్న ఓ పోర్టర్‌ని పిలిచి 'మా వూరికి టికెట్ తెచ్చిపెట్టమని' అడిగాను. అతడు అంగీకరించ టంతో ఆనందంగా మూడు పదికాయితాలు అతని చేతికి యిచ్చాను. డబ్బు తీసుకుని వెళ్ళాడతడు.

నేను దిగిన రైలు కదిలి వెళ్ళిపోయింది. దూరం నుంచి మరో రైలు వస్తున్న శబ్దం. లైటు కనిపిస్తున్నది. నేను టిక్కెట్‌కోసం పంపిన పోర్టర్ ఇంకా రాలేదు. నాలో చిన్నపాటి ఆందోళన. అతను అసలు వస్తాడా? టిక్కెట్ తెచ్చి ఇస్తాడా? అని ధర్మసందేహాలు. మోస పోయినా సరే, అతనికి అలా డబ్బిచ్చి పంపటం తప్పనిపించలేదు నాకు. తెస్తాడని మనసు పలుకుతున్నది. అతను టిక్కెట్టు తీసుకువస్తే మనుషుల్లో ఇంకా నిజాయితీ ఎక్కువ వున్న దనే నా నమ్మకానికి మరింత ఊపిరి పోసిన వాడవుతాడు. అలాంటి నమ్మకాలకు ఆయుష్షు పోస్తుంటేనే మన మనుగడకు ఓ సార్థకత అని నా బలీయమైన విశ్వాసం.

నా ఆలోచనలు ఇలా ఎడతెరిపి లేకుండా సాగుతూనే వున్నా పక్కనే జరుగుతున్న తండ్రీ కూతుళ్ళ సంభాషణ నా చెవిన పడుతూనే వున్నాయ్. నాలో ఆలోచనలు రేపుతూనే వున్నాయి.




"లాస్ట్ సెమిస్టర్ కన్నా ఎందుకమ్మా ఈ సారి మార్కులు తగ్గినాయి" అడిగాడు తండ్రి.

"ఒక్క సబ్జెక్ట్‌లోనే నాన్నా... మిగిలిన వాటి అన్నింట్లో బాగానే వచ్చినయ్" సంజాయిషీ ధ్వనించకపోలేదు ఆ అమ్మాయి గొంతులో.

"అదే... ఒక్క సబ్జెక్ట్‌లో అయినా టోటల్ మార్క్స్ మీద చూసుకోవాలి కదా"

"అవునుగానీ అసలా రోజు పరీక్ష వ్రాయ లేనేమో అని భయం వేసింది. ఉదయాన్నే ఎందుకో కళ్ళు తిరిగినట్లనిపించింది. కాసేప య్యాక వాంతి కూడా అయ్యింది... ఓ అర గంట పడుకున్నాక తగ్గింది"

దూరంగా కన్పిస్తున్న పోర్టర్ నేను పంపిన అతనే అని గుర్తుపట్టాను. అంతలోనే దగ్గరగా వచ్చాడు. అతనే టిక్కెట్టు ఇచ్చి చిల్లర తిరిగి ఇవ్వబోయాడు. వద్దని వారించాను. సంతో షంగా తిరిగి వెళ్లాడతను. గర్వంగా ఫీల య్యాను నేను. నా గర్వం నా పని సుఖంగా అయినందుకు కాదు. డబ్బులు జేబులో కుక్కు కుని తిరిగి రాక పోతే ఆయనేం చేస్తాడ్లే అను కోకుండా అతగాడు నిజాయితీగా ప్రవర్తించి నందుకు నాకు ఆ గర్వం కలిగింది. మను ష్యుల్ని నమ్మవచ్చు, నమ్మాలి, అని మరోసారి

రుజువు చేసిన అతడ్ని మనసులోనే అభినందించాను.

"అమ్మ ఎలావుంది నాన్నా" తండ్రిని అడుగుతున్న ఆ అమ్మాయి ప్రశ్న వినబడింది.

"మీ అమ్మకేం... హాయిగా వుంది. పగలు ఓ అరడజను సీరియల్స్, రాత్రిపూట ఓ అరడజను సీరియల్స్ చూస్తూ నిశ్చింతగా వుంది. కాకపోతే నువ్వెలా చదువుతున్నావోనని అప్పుడప్పుడు మథనపడుతుంటుంది అంతే"

"పోయినసారి మార్క్సు తెలీగానే అమ్మకే చెప్పానుగా ఫోనులో ఇంకా దిగులెందుకు"

"ఎప్పటికప్పుడే నమ్మా"

"డాడీ... మొన్న ఒక పదిహేను రోజుల క్రితం అయితే ఈ సంవత్సరం బ్రేక్ వస్తుందని హడలి చచ్చిపోయా తెల్సా"

"ఏమైందమ్మా"

"ఏదో బోయ్స్‌కి, లెక్చరర్‌కి గొడవయిందట. అందరం స్ట్రయిక్ చేయాలనుకున్నారట మొదట్లో. అలాంటివేం చేసినా వెంటనే ఇంటికి పంపించేస్తాం మీ ఇష్టం అన్నారట ప్రిన్సిపల్ సార్. అయినా చేయాల్సిందేనని మొండిగా మాట్లాడారుట కొందరు. అయినా ఎందుకో మొత్తం మీద ఏం జరగలేదు. మా గర్ల్స్ అందరం మాత్రం భలే భయపడ్డాం ఏలాగా అని" అమాయకంగా వున్నాయి ఆ అమ్మాయి మాటలు.

మేం ఎక్కవలసిన రైలు మరో అరగంట ఆలస్యంగా వస్తున్నట్లు ప్రకటన వినబడింది.

"ఎప్పుడోప్పుడు మొత్తం మీద వస్తున్నది కదా" పెద్దగానే అన్నాడు పెద్దాయన.

నవ్వేను నేను.

"ఏం చదువుతున్నావమ్మా" అడిగాన్నేను.

"ఇంజనీరింగ్ అంకుల్... సెకండ్ ఇయర్" చెప్పిందా అమ్మాయి.

"అచ్చా..."

అంతలోనే అక్కడ ఏదో కలకలం ప్రారంభం అయ్యింది.

పోర్టర్లు నలుగురో అయిదుగురో ఓ చోట చేరి పోట్లాడుకోసాగారు. మా అందరి దృష్టి కాసేపటు మళ్ళింది. ఎవరో పెద్ద మనిషి జోక్యంతో ఆ అరుపులు, కేకలు సద్దుమణిగినై.

"ఆ సమ్మె విషయం పూర్తిగా ముగిసి పోయినట్లేనా" అడిగాడు తండ్రి.

"ఆ.. అప్పుడే అయిపోయింది. లేకపోతే ఈ సంవత్సరం అంతా వృథా అయ్యేదే"



**న్యూ**ఢిల్లీ ఎ.పి. భవన్‌లో రాజ్యోత్సవాల సందర్భంగా నిర్వహించిన సంగీత పోటీలలో ద్వితీయ బహుమతి గెలుచుకొని ఆంధ్రప్రదేశ్ ప్రధాన పరిశ్రమల శాఖా మంత్రి శ్రీ బి. సత్యనారాయణ గారి ద్వారా మెమెంటో సర్టిఫికేట్ అందుకొంటున్న చి. కందుకూరి పూజిత.

"సంవత్సరం వృథా అట్లా వుంచు. మాకు ఇంకో లక్ష రూపాయాలు వదిలేవి కదా అనవసరంగా... అయినా చదువుకోవటానికి వెళ్ళిన వాళ్ళు బుద్ధిగా చదువుకోక ఈ సమ్మెలు, అల్లర్లు ఎందుకట... పన్లేక" కోపంగా అన్నాడు తండ్రి.

"పాపం అబ్బాయి తప్పేంలేదు నాన్నా. ఆ లెక్చరరే అతడ్ని చాలా ఇబ్బంది పెట్టాడు. ఎలాగైనా మార్కులు తక్కువ వేసి అతన్ని ఫెయిల్ చేయిస్తానని శపథం కూడా చేశాడు"

"నువ్వలాంటి వాటి జోలికి పోకమ్మా. వాళ్ళతో కలసి తిరగటం కూడా పనికిరాదు. వాళ్ళ దృష్టిలో అలా కనబడితే నీకూ మార్కులు తగ్గించేసారు. ర్యాంకు రాకపోతే ఎట్లా... జాగ్రత్త" మందలింపుతో కూడిన హెచ్చరింపు వినపడింది అయిన మాటల్లో.

ఉండబట్టలేక పోయాన్నేను.

"ఏమ్మా ఉదయం ఏమైనా తిని రైలెక్కావా... లేకపోతే రైల్లో ఏమన్నా తెప్పించుకుని తిన్నావా" అడిగాను ఆ అమ్మాయిని.

"ఏం తిన్లేదు అంకుల్... కుదర్లా"

"ఆకలిగా లేదు మరి"

నవ్విందా పసిప్రాణి.

"ఈ మాటలు నిన్ను మీ నాన్న అడగలేదనిపించలేదా అమ్మా" లాలనగా అడిగాను.

తలదించుకుని మౌనంగా వుండిపోయిందా అమ్మాయి.

"ఆ పిల్ల రైలు దిగింది మొదలు, మార్కులు, ర్యాంకులు అంటూ ఆరా తీస్తున్నారే గానీ ఆరోగ్యం గురించి, అన్నం తినడం గురించి, ఆకలి గురించి అడగాలనిపించ లేదుటండీ మీకు" సూటిగానే అడిగాను.

అంతలోనే పెద్దగా కూత వేసుకుంటూ వస్తున్న రైలు కనిపించిందీ, వినిపించింది.

ఆయనేదో అన్నాడు. ఏమన్నాడో ఆ రైలు కూతలో వినబడలేదు. బహుశా 'నీకు అనవసరం' అన్నాడేమో అని నేను వూహించుకున్నాను. రైలు వచ్చి ఆగగానే ఎవరిదారిన వాళ్లం రైలెక్కాం. రైలు కదిలింది.

'స్నేహితులు, బంధువులు కలిస్తే, షేర్ల ధరలు, కార్ల ధరలు మాట్లాడుకుంటున్నారు, భార్యాభర్తలయితే ఆదాయవ్యాయాలు చర్చించుకుంటున్నారు. పొరపాటున ఇరుగు పొరుగు కనపిస్తే బుల్లి తెర సీరియల్స్ గురించి ముచ్చటించుకుంటున్నారు. అవన్నీ ఒక ఎత్తయితే తల్లితండ్రులు, తమ పిల్లల్ని కలుసుకున్నప్పుడు కూడా కష్టసుఖాల గురించి కాకుండా, లాభ నష్టాలగురించి మాత్రమే మాట్లాడుకోగలిగే దిశలో మనం ముందుకు పోతున్నామని అలా మన దశ వెలిగిపోతున్నదని అనుకుని ఆత్మవంచన చేసుకుంటూ బ్రతుకుతున్నాం' నా ఆలోచన్ల మధ్యనే రైలు, స్టేషన్లో ఆగింది. లగేజ్‌తో దిగాను. రైలు కదిలింది. నేనూ స్టేషన్‌నుండి బయటకు కదిలాను. మళ్ళీ నా మనసూ కదిలింది.

"ఆ పెద్దమనిషి నాకేం జవాబు చెప్పేడో వినపడివుంటే బాగుండేది' అనుకున్నాను మనసులో.

పాలకుండలో విషం చుక్క పడితే ఆ పాలన్నీ విషతుల్యం అవుతాయి. కానీ విషపు కుండలో పాల చుక్కపడితే కూడా ఆ విషమంతా పాలగా మారతాయా? మానవ సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలే అయిపోయినప్పుడు, మనుషులు కష్ట సుఖాలు మాట్లాడుకునే రోజులు మర్చిపోయి కేవలం లాభ నష్టాలు మాత్రమే మాట్లాడుకుంటున్న ఈ రోజుల్లో నా మాటలు పాలచుక్కలే కదూ! ❀